సాక్షి రంగారెడ్డి

గురువారం । 18 । జనవరి । 2024



క్రీడలకు రాజకీయ రంగు

నక్కర్తమేడిపల్లిలో సంక్రాంతి పండుగ సందర్భంగా జరిగిన క్రికెట్ పోటీలకు రాజకీయ రంగు పులుముకుంది. 8లో▸



గంజాయి పట్టివేత

గంజాయి తరలిస్తున్న ముగురిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు మోకిల సీఐ వీరబాబు తెలిపారు. 8లో▸



కాలుష్య కోరల్లో..

నందిగామ మండలం నర్సప్పగూడ శివారులోని చేగూరు రోడ్డు వద్ద గల ఓ పరిశ్రమ కాలుష్యం వెదజల్లుతోంది. 8లో▸

న్యూస్‌రీల్

నేడు డయల్ యువర్ డీఎం

షాద్‌నగర్‌రూరల్: ఆర్టీసీ ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు షాద్‌నగర్ డిపో మేనేజర్ ఉష బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ప్రయాణికులు తమ సమస్యలను 9959226287 నంబర్ ద్వారా విన్నవించి పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు.

8న ఓటర్ల తుది జాబితా విడుదల

ఆర్డీఓ అనంతరెడ్డి



మాట్లాడుతున్న ఆర్డీఓ అనంతరెడ్డి

ఇబ్రహీంపట్నం: ఫిబ్రవరి 8న ఓటర్ల తుది జాబితా విడుదల చేస్తామని ఆర్డీఓ అనంతరెడ్డి తెలిపారు. రానున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఇబ్రహీంపట్నం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో గుర్తించబడిన వివిధ రాజకీయపక్షాల ప్రతినిధులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఓటర్ల నమోదు, మార్పులకు స్పెషల్ క్యాంపెయిన్ ఈనెల 20, 21 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆయా తేదీల్లో 18 ఏళ్ల నిండిన యువత కొత్త ఓటర్‌గా నమోదు చేసుకోవచ్చని సూచించారు. ఓటర్ల జాబితాపై అభ్యంతరాలుంటే ఈనెల 29 లోపు తెలియజేయాలని ఆయా రాజకీయపక్షాల నేతలను కోరారు. సమావేశానికి కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం, టీడీపీల తరఫున ప్రతినిధులు హాజరయ్యారు.

ఆఫ్రికన్ లయన్ దత్తతకు 'అరిజీన్' సుముఖత



క్యూరేటర్‌కు చెక్కును అందజేస్తున్న ప్రతినిధులు

బహదూర్‌పురా: నెహ్రూ జూలాజికల్ పార్కును బుధవారం బొల్లారానికి చెందిన అరిజీన్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ ప్రతినిధులు సందర్శించారు. ఈ సందర్భంగా జూపార్కులోని ఆఫ్రికన్ లయన్ (మనోహర్)ను సంవత్సరం పాటు దత్తత తీసుకున్నారు. దత్తతకు సంబంధించిన రూ.3లక్షల చెక్కును జూపార్కు క్యూరేటర్ డాక్టర్ సునీల్ ఎస్ హిరేమత్‌కు అందజేశారు. అనంతరం క్యూరేటర్ హిరేమత్ మాట్లాడుతూ.. వన్యప్రాణుల దత్తతకు ప్రతి ఒక్క రూ ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో అరిజీన్ ఫార్మా స్యూటికల్స్ లిమిటెడ్ ప్రతినిధులు అశుతోష్ అనీల్ కొత్వాల్, ఎన్.దీపక్, సత్యనారాయణ్ గిరి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రగతి మహా విద్యాలయ స్వర్ణోత్సవాలు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కళాశాల ఉన్నతాధికారులు

సుల్తాన్‌బజార్: ప్రగతి మహా విద్యాలయ డిగ్రీ కళాశాల స్వర్ణోత్సవాలు ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు జరగనున్నట్లు కళాశాల చీఫ్ ప్యాట్రన్ మహేశ్ ఎస్ పటేల్, చైర్మన్ గోవింద్ దాస్ షా, కో చైర్మన్ గోపాల్ పటేల్ తెలిపారు. ఈ మేరకు బుధవారం హనుమాన్ టేక్డీలోని ప్రగతి మహా విద్యాలయ కళాశాలలో స్వర్ణోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 1973లో కేవలం 43 మందితో కళాశాల ప్రారంభమైందని, ప్రస్తుతం 2,500 మంది విద్యార్థులతో కొనసాగుతోందన్నారు. ఈ కళాశాలలో ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు పూర్వ విద్యార్థులేనన్నారు. సమావేశంలో అంబాలాల్ పటేల్, రాహుల్, భారతిడేన్ పటేల్, వైకేఎం నాయుడు, డాక్టర్ ఎ.మాధవీలత, అమృత్‌సింగ్, టీసీ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అవిశ్వాస 'పురం'పర

ఆశావహుల ఆశలు నెరవేరేనా?

- కొన్ని మున్సిపాలిటీల్లో కొనసాగుతున్న క్యాంపులు
- మరికొన్ని చోట్ల తిరిగొచ్చిన కౌన్సిలర్లు
- ఏం జరుగుతుందోనని స్థానికంగా చర్చోపచర్చలు



సాక్షి, రంగారెడ్డి జిల్లా: పాలకమండళ్ల గడువు దగ్గర పడుతున్న కొద్దీ జిల్లాలోని పలు నగర/పురపాలికల్లో రాజకీయం రసవత్తరంగా మారుతోంది. ఈ నెల 28తో పాలక మండళ్ల ఏర్పడి నాలుగేళ్లు పూర్తవుతోంది. ఇప్పటికే పలువురు మేయర్లు, చైర్మన్లు, వైస్ చైర్ పర్సన్లపై అవిశ్వాస తీర్మానానికి నోటీసులు కూడా ఇచ్చారు. నోటీసులు ఇచ్చిన వారిలో కొంత మంది క్యాంపులకు వెళ్లారు. వీరిలో కొంత మంది తిరిగి రాగా, మరికొంత మంది అక్కడే ఉండిపోయారు. ఇంతకీ వారికి వ్యతిరేకంగా తీర్మానం ఉంటుందా? ఈ నోటీసులపై కలెక్టర్ ఏం నిర్ణయం తీసుకోనున్నారు? అనే అంశాలపై చర్చ జరుగుతోంది. మేయర్, చైర్మన్ పీఠాలను దక్కించుకోవాలనే కల నెరవేరుతుందా? లేదా అనే ప్రశ్న ఆశావహుల్లో వ్యక్తమవుతోంది. ఇచ్చిన నోటీసులపై ఒక వైపు తీవ్రమైన సందిగ్ధత కొనసాగుతుండగా, మరోవైపు షాద్‌నగర్, తుర్కయంజాల్ మున్సిపాలిటీలు, బడంగ్ పేట్ కార్పొరేషన్‌లోని ఆశావహులు తెరవెనుక పావులు కదుపుతున్నారు.

ఆదిబట్ల.. తేలేదెట్లా..!

ఆదిబట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ ఆర్తిక(కాంగ్రెస్)పై అదే పార్టీకి చెందిన కౌన్సిలర్లు జనవరి 9న అదనపు కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానానికి నోటీసులు ఇచ్చారు. మున్సిపాలిటీలో 15 మంది అభ్యర్థులు ఉండగా, వీరిలో 13 మంది నోటీసులపై సంతకాలు పెట్టారు. ఆ తర్వాత 12 మంది క్యాంపు (రాజమండ్రి, వైజాగ్, భీమవరం)నకు వెళ్లారు. తాజాగా బుధవారం ఉదయం క్యాంపు నుంచి తిరిగి వచ్చారు. చైర్‌పర్సన్ పదవిని ఆశిస్తున్న ఓ కౌన్సిలర్ తనతో పాటు క్యాంపునకు వచ్చిన వారికి భారీగా ప్యాకేజీ ముట్టజెప్పినట్లు తెలిసింది.

బండ్లగూడ .. ఒత్తిడి తెచ్చినా కూడా

బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అభ్యర్థి లతా ప్రేమ్‌గౌడ్‌పై 16 మంది (బీజేపీ నుంచి ఒకరు, కాంగ్రెస్ నుంచి ఇద్దరు, బీఆర్ఎస్ నుంచి 13 మంది) తిరుగుబావుటా ఎగురవేశారు. మొత్తం 22 మంది కార్పొరేటర్లు ఉండగా, వీరిలో ఒకరు మృతి చెందారు. వీరంతా ఇటీవల కలెక్టర్ శశాంకను కలిసి నోటీసులు అందజేశారు. అదే రోజు క్యాంపునకు వెళ్లారు. నిన్నటి వరకు ఏపీలో ఉన్న నేతలు తాజాగా బుధవారం బెంగళూరుకు చేరుకున్నారు. కేవలం ఆరు నెలల కోసం అవిశ్వాస తీర్మానం పెట్టడం సరైన నిర్ణయం కాదని, క్యాంపు నుంచి తిరిగి రావాల్సిందిగా స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ వారిపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. వచ్చే ఎన్నికల్లో పోటీకి అవకాశం ఇచ్చేది లేదని హెచ్చరించినా వారు ససేమిరా అనడం గమనార్హం. నోటీసులిచ్చి రోజులు గడుస్తున్నా..ఇప్పటి వరకు అధికారులు అవిశ్వాస తీర్మానానికి ఏర్పాట్లు చేయకపోవడంతో క్యాంపుల్లోకి వెళ్లిన వారిలో ఆందోళన మొదలైంది. అసలు అవిశ్వాస తీర్మానం ఉంటుందా? లేదా అనే సందేహం వ్యక్తమవుతోంది.

షాద్‌నగర్.. కౌన్సిలర్ల గుర్రు

షాద్‌నగర్ చైర్మన్‌పై కూడా కాంగ్రెస్ కౌన్సిలర్లు గుర్రుగా ఉన్నట్లు తెలిసింది. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు ఎమ్మెల్యే వర్గీయులు ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాతపై కూడా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు కొంతమంది సభ్యులు తెరవెనుక పావులు కదుపుతున్నట్లు తెలిసింది. తుర్కయంజాల్ మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టాలని తొలుత భావించినప్పటికీ.. ఆ తర్వాత చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల మధ్య వారు వెనక్కి తగ్గినట్లు సమాచారం.

'పట్నం'.. తప్పని కలవరం

ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో బీజేపీకి రెండు, కాంగ్రెస్‌కు ఆరు, బీఆర్ఎస్‌కు 16 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వీరిలో బీఆర్ఎస్ అభ్యర్థి కప్పరి స్రవంతిని చైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నారు. ప్రస్తుతం 17 మంది కౌన్సిలర్లు చైర్ పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ మేరకు జనవరి 8న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు నోటీసులు ఇచ్చి, ఆ వెంటనే 11 మంది క్యాంపు(గోవా)నకు వెళ్లిపోయారు. నోటీసులు అందజేసి పది రోజులైనా ఇప్పటి వరకు బలప్రదర్శనకు ఏర్పాట్లు చేయకపోవడంతో క్యాంపుల్లో ఉన్న వారిలో ఆందోళన మొదలైంది.

పెద్ద అంబర్‌పేట .. వీడేనా ఉత్కంఠ?

పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీలో 24 వార్డులు ఉండగా, వీటిలో కాంగ్రెస్ 13, బీఆర్ఎస్ 8, బీజేపీ 1, సీపీఐ ఒకటి, ఇండిపెండెంట్ ఒకటి చొప్పున గెలుపొందారు. ఎక్స్ అఫీషియో సభ్యులు, కాంగ్రెస్‌లోని మరికొంత మంది కౌన్సిలర్ల సహకారంతో అప్పటి బీఆర్ఎస్ అభ్యర్థి చవుల స్వప్న చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్‌గా కాంగ్రెస్ అభ్యర్థిని ఎన్నుకున్నారు. అప్పటి వరకు బీఆర్ఎస్‌లో కొనసాగిన చైర్ పర్సన్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరారు. గత జనవరి 28న 15 మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడుతూ అప్పటి కలెక్టర్‌కు నోటీసులు ఇచ్చారు. చైర్మన్, వైస్ చైర్మన్ ఒక గ్రూపు, పార్టీలకు అతీతంగా కౌన్సిలర్లు మరో గ్రూపు ఇలా రెండు గ్రూపులు 25 రోజుల పాటు క్యాంపునకు వెళ్లారు.హైకోర్టు స్టే విధించడంతో పాటు ప్రభుత్వం కూడా ఏ నిర్ణయం తీసుకోలేదు.దీంతో క్యాంపునకు వెళ్లిన వారంతా తిరిగి వచ్చేశారు. గతంలో ఇచ్చిన నోటీసులనే పరిగణలోకి తీసుకుంటురా?లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. స్థానిక ఎమ్మెల్యే ఈ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే అంశంపై చర్చ కొనసాగుతోంది.

టెస్ట్ మ్యాచ్‌కు గట్టి భద్రత

రాచకొండ సీపీ సుధీర్ బాబు



గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న సీపీ సుధీర్ బాబు తదితరులు

ఉప్పల్: భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య ఈ నెల 25 నుంచి ఉప్పల్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరగనున్న టెస్ట్ మ్యాచ్‌కు పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు రాచకొండ సీపీ సుధీర్ బాబు చెప్పారు. ఉప్పల్ స్టేడియంలో బుధవారం క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టేడియంలో లోపల, బయట సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. బ్లాక్‌లో టికెట్లు విక్రయించే వారిపై నిఘా పెట్టాలని సూచించారు. స్టేడియంలో విక్రయించే తిను బండారాలు, శీతల పానీయాల ధరలు నిబంధనల ప్రకారం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్ మోహన్‌రావు, ఉపాధ్యక్షుడు దల్జీత్ సింగ్, కార్యదర్శి దేవరాజు, మల్కాజిగిరి డీసీపీ పద్మజ పాల్గొన్నారు.

యోగా సర్టిఫికెట్ కోర్సుకు విశేష స్పందన

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ దూర విద్యా కేంద్రంలో ప్రారంభించిన ఆరు నెలల యోగా సర్టిఫికెట్ కోర్సుకు విశేష స్పందన లభించిందని డైరెక్టర్ ప్రొ.జీబీ రెడ్డి తెలిపారు. గత ఏడాది ప్రవేశపెట్టిన కోర్సులో 35 మంది విద్యార్థులు ప్రవేశం పొందినట్లు పేర్కొన్నారు. నిష్ణాతులైన యోగా గురువులతో సాధన, బోధన కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ఓయూ దూరవిద్యలో 2023-24 విద్యా సంవత్సరానికి బీఏ, బీకాం, బీఎస్సీ, పీజీ, పీజీ డిప్లొమా కోర్సుల్లో రెండో విడత ప్రవేశాలకు త్వరలో నోటిఫికేషన్ ఉంటుందని పేర్కొన్నారు.

ఏళ్లుగా పెండింగ్‌లోనే..

- 32 లక్షల చలాన్లు.. రూ.114 కోట్ల జరిమానాలు
- రాచకొండ పరిధిలో పేరుకుపోయిన ఫైన్లు
- వినియోగించే వాహనాలకే చెల్లింపులు
- ఏటా పెరుగుతున్న ఎంవీ యాక్ట్ కేసులు
- పెండింగ్‌వి రద్దు చేయడమే ఉత్తమం అంటున్న నిపుణులు

సాక్షి, సిటీబ్యూరో: రాచకొండ పోలీసు కమిషనరేట్‌లో పరిధిలో పదమూడేళ్లుగా ట్రాఫిక్ చలాన్లు పెండింగ్‌లో ఉన్నాయి. ట్రాఫిక్ ఉల్లంఘనలపై పోలీసులు ఎప్పటికప్పుడు జరిమానాలు విధిస్తూనే ఉన్నారు. దీంతో ఏటా పెండింగ్ చలాన్లు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. వీటిని క్లియర్ చేసేందుకు ప్రభుత్వం ఈ నెల 31 వరకు డిస్కౌంట్ ఆఫర్‌ను ప్రకటించిన సంగతి తెలిసిందే. అయినా ఇప్పటికీ వాహనదారుల నుంచి స్పందన లేకుండాపోయింది. 2010 నుంచి ఈ నెల 17 వరకు రాచకొండలో 32.69 లక్షల ట్రాఫిక్ చలాన్లు, రూ.114 కోట్ల జరిమానాలు పెండింగ్‌లో ఉన్నాయి.

ఆఫర్ ఆదాయం రూ.15 కోట్లు..

భారీ ఆఫర్ ఇచ్చినప్పటికీ జరిమానాలు చెల్లించడంలో వాహనదారులు మొండికేస్తున్నారు. ఈ నెలాఖరు వరకు ఆర్టీసీ బస్సులు, తోపుడు బండ్లపై 90 శాతం, బైక్, ఆటోలపై 80 శాతం, భారీ వాహనాలపై 60 శాతం డిస్కౌంట్ ఉంది. ఆఫర్ అమలులోకి వచ్చిన మొదట్లో వాహనదారుల నుంచి విశేష స్పందన లభించిందని, ఆఫర్‌ను పొడిగించిన తర్వాత పెద్దగా ప్రయోజనం కనిపించడంలేదని రాచకొండ ట్రాఫిక్ అధికారి ఒకరు తెలిపారు. కాగా.. డిస్కౌంట్ ఆఫర్‌లో రాచకొండలో 19 లక్షల చలాన్లు క్లియర్ కాగా, రూ.15 కోట్ల ఆదాయం సమకూరింది.

ఏళ్లుగా పెండింగ్‌లో ఉంటే రద్దు

ఎన్నిసార్లు డిస్కౌంట్‌ను ప్రకటించినా సరే 10- 20 శాతం చలాన్లు పెండింగ్‌లోనే ఉంటాయి. ఎందుకంటే ఆయా వాహనాలు వినియోగంలో లేకపోవడమో, చోరీకి గురవడమో, తుప్పులో విక్రయించడమో జరుగుతుంటాయి. ట్రాఫిక్ పోలీసుల డేటాలో మాత్రం ఆ వాహనాలపై చలానాలు పెండింగ్‌లోనే చూపిస్తుంటాయి. అందుకే కొన్నేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న చలాన్లను డేటా నుంచి తొలగించేలా లేదా రద్దు చేసేలా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న వాహనాలపై తాజాగా మళ్లీ చలానా పడితే తనిఖీ చేసి పట్టుకొని జరిమానా వసూలు చేయాలని పేర్కొన్నారు. దీంతో పెండింగ్ కేసులతో పాటు ట్రాఫిక్ పోలీసులపై ఒత్తిడి తగ్గుతుందని తెలిపారు.

ప్రభుత్వ చలాన్లపై నిర్లక్ష్యం..

సాధారణ రోజులైనా, డిస్కౌంట్ ప్రకటించినా సరే ప్రభుత్వ వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్లను చెల్లించడంలో ఆయా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఎందుకంటే చలానా జారీ అయినప్పుడు ఉన్న అధికారి, ప్రస్తుతం ఆ వాహనాన్ని వినియోగించే అధికారి వేరే వారై ఉంటారు. దీంతో సదరు అధికారి పెండింగ్ జరిమానాలను క్లియర్ చేయడం లేదు. దీంతో చాలా వరకు ప్రభుత్వ వాహనాలపై చలాన్లు పెండింగ్‌లోనే ఉంటున్నాయి. తమిళనాడు వంటి రాష్ట్రాల తరహాలోనే తెలంగాణలో కూడా ప్రభుత్వ వాహనాలకు ప్రత్యేక సిరీస్‌ను కేటాయించాలని, ఆయా డేటాను ప్రత్యేకంగా నమోదు చేయాలి. ప్రస్తుతం రాష్ట్రంలో పోలీసు వాహనాలు '9పీ', ఆర్టీసీ బస్సులకు 'జెడ్' నంబరుతో మొదలవుతాయి. మిగిలిన ప్రభుత్వ విభాగాలకు లేవు.

కరెంట్ కష్టాలకు చెక్!

- వేసవి కార్యాచరణ ప్రణాళిక రెడీ
- 82- 85 ఎంయూల విద్యుత్ డిమాండ్
- అంచనా వేసిన డిస్కం.. సరఫరాకు సిద్ధం
- ఫిబ్రవరి 10 వరకు నిర్వహణ పనులు పూర్తి



సాక్షి, సిటీబ్యూరో: కరెంట్ సరఫరాలో హెచ్చు తగ్గులు, కోతలకు ఆస్కారం లేకుండా చూడాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ నిర్ణయించింది. ఈ మేరకు ముందస్తు కార్యాచరణ ప్రణాళి కను సిద్ధం చేసింది. గత వేసవిలో విద్యుత్ డిమాండ్, వెలుగు చూసిన సాంకేతిక సమస్యలు, వినియోగదారుల నుంచి ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే క్షేత్రస్థాయిలో పర్యటించి, లోపాలను సరిదిద్దే పనిలో నిమగ్నమైన ఇంజినీర్లు.. తాజాగా ఫీడర్లు, లైన్ల పునరుద్ధరణ పనులపై దృష్టి సారించారు. ఫిబ్రవరి 10లోగా ఈ పనులు పూర్తి చేయాలని నిర్ణయించారు. గతానికి భిన్నంగా లైన్ల పునరుద్ధరణ పేరుతో పగలంతా విద్యుత్ సరఫరా నిలిపివేయకుండా సబ్ స్టేషన్లలోని ఫీడర్లు/డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల వారీగా రోజుకు కనీసం 15 నిమిషాల నుంచి రెండున్నర గంటలకు కుదించారు. ఏ రోజు.. ఏ సమయంలో..ఏ లైన్‌లో పునరుద్ధరణ పనులు చేపడుతున్నారు? ఎన్ని గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది? అనే అంశాన్ని ఎప్పటికప్పుడు ఎస్ఎంఎస్, ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా వినియోగదారులకు చేరవేస్తున్నారు. వినియోగదారుల నుంచి వ్యతిరేకత రాకుండా జాగ్రత్త పడుతున్నారు.

గ్రేటర్ పరిధిలో విద్యుత్ కనెక్షన్లు ఇలా..

విద్యుత్ కనెక్షన్లు	2021	2022	2023
గృహ	44,26,472	46,28,067	50,99,190
వాణిజ్య	7,31,441	7,61,938	8,22,821
పారిశ్రామిక	35,283	35,419	36,440
ఇతర కనెక్షన్లు	2,02,707	2,11,020	1,82,344
మొత్తం	53,95,903	56,36,444	61,40,795
వేసవి పీక్ డిమాండ్ (మెగావాట్లలో)	3,158	3,435	3,756

ఏటా పెరుగుతున్న డిమాండ్

గ్రేటర్‌లోని తొమ్మిది సర్కిళ్ల పరిధిలో విద్యుత్ కనెక్షన్ల సంఖ్య ఏటా పెరుగుతోంది. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా సబ్‌స్టేషన్లలోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, అదనపు ఫీడర్లు, లైన్లు, డీటీఆర్‌లను ఏర్పాటు చేస్తోంది. 2021 మేలో రోజు సగటు పీక్ డిమాండ్ 3,158 మెగావాట్లు (67.01 మిలియన్ యూనిట్లు) ఉండగా, 2022 మే నాటికి 3,435 మెగావాట్ల(71.04 ఎంయూ)కు చేరింది. ఇక 2023 మే నాటికి రోజు పీక్ డిమాండ్ 3,756 మెగావాట్లు (79.03 ఎంయూ)గా ఉంది. తాజాగా 2024 మే నాటికి నాలుగు వేల మెగావాట్లు (82 నుంచి 85 ఎంయూలు) దాటే అవకాశం ఉన్నట్లు డిస్కం అంచనా వేసింది. ఒకవైపు భగ్గున మండే ఎండలకు తోడు విద్యుత్ డిమాండ్ భారీగా పెరగనుండటంతో సబ్‌స్టేషన్లపై భారం పడి తరచూ ఫీడర్లు ట్రిప్పయ్యే అవకాశం ఉంది. అంతేకాదు ఆయిల్ లీకేజీల కారణంగా వేడికి డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోయే ప్రమాదమూ లేకపోలేదు. ఈ వేసవి డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని సీఎండీ ముషారఫ్ ముందస్తు యాక్షన్ ప్లాన్ రెడీ చేశారు. ఈ మేరకు లైన్ల పునరుద్ధరణ పనులు సకాలంలో పూర్తి చేయాల్సిందిగా క్షేత్రస్థాయి ఇంజినీర్లకు ఆదేశాలు జారీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తొమ్మిది సర్కిళ్ల పరిధిలో 11 కేవీ ఫీడర్లు 2,352 వరకు ఉన్నాయి. ఈ లైన్ల పునరుద్ధరణ పనుల్లో భాగంగా గురువారం 125 ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. కొన్ని ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 12.30 గంటలకు మరికొన్ని ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి 5.30 గంటల వరకు సరఫరాను నిలిపివేయనున్నారు. ఈ సమయంలో లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల నరికివేత, లూజ్ లైన్లను సరిచేయడం, డీటీఆర్‌ల వద్ద ఆయిల్ లీకేజీలను గుర్తించి, వాటిని అరికట్టడం, దెబ్బతిన్న ఇన్సులేటర్లను మార్చడం, ఏబీ స్విచ్‌లను సరి చేయడం, సబ్‌స్టేషన్లు, ఫీడర్లు, డీటీఆర్‌ల వద్ద ఎర్తింగ్ సక్రమంగా ఉండేలా చూడటం, కండక్టర్ జాయింట్లను సరిచేయడం వంటి పనులు చేపట్టనున్నట్లు డిస్కం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది.

ఆకాశ వీధిలో..

నేటినుంచి వైభవంగా ఏవియేషన్ షో



- వింగ్స్ ఇండియా- 2024 ఎయిర్‌షోకు సర్వం సిద్ధం
- బేగంపేట్ ఎయిర్‌పోర్ట్ వేదికగా సందడి
- సారంగ్ జట్టులో ముగ్గురూ హైదరాబాదీలే..



సాక్షి, సిటీబ్యూరో/సనత్‌నగర్: నగరానికే తలమానికమైన ఏవియేషన్ షోకు సర్వం సిద్ధమైంది. బేగంపేట్ ఎయిర్‌పోర్ట్ వేదికగా 'వింగ్స్ ఇండియా-2024' గురువారం నుంచి ప్రారంభం కానుంది. ఈ నెల 21 వరకు నిర్వహించే ఈ షోలో 25 వరకు విమానాలు, హెలికాప్టర్లను ప్రదర్శించనున్నారు. తొలిసారిగా ప్రదర్శనకు వస్తున్న బోయింగ్‌తో పాటు ఎయిర్ ఇండియా మొదటి హెలికాప్టర్ ఏ350 లాంటివి ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. మొదటి రెండు రోజులు వ్యాపార, వాణిజ్య వేత్తలకు, ఆ తర్వాత రెండు రోజులు సామాన్యులను సైతం అనుమతిస్తారు. కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో పాటు ఉన్నతాధికారుల రాకను పురస్కరించుకుని 600 మంది కానిస్టేబుళ్లు, 30 మంది ఇన్‌స్పెక్టర్లు, ఐదుగురు ఏసీపీలతో పాటు ట్రాఫిక్ సిబ్బంది బందోబస్తులో పాల్గొననున్నారు. విమానాశ్రయాన్ని డాగ్‌స్క్వాడ్‌తో అడుగడుగునా తనిఖీ చేశారు.

ఏ గేటు నుంచి ఎవరెవరు ప్రవేశం..

గేటు 1: చాలెట్ ఎగ్జిబిటర్లు, వీఐపీలు, అతిథులు

గేటు 2: కాన్ఫరెన్స్ డెలిగేట్స్, సీఈఓ రౌండ్ టేబుల్‌కు హాజరయ్యేవారు

గేటు 3: నిర్వాహకులు, చాలెట్ ఎగ్జిబిటర్స్, ప్రభుత్వ ప్రతినిధులు

గేట్ 4: నిర్వాహకులు, ఎగ్జిబిటర్స్, మీడియా, బిజినెస్ విజిటర్స్

గేటు 5: ఎయిర్‌పోర్ట్ ఎంప్లాయీస్, ఎగ్జిబిటర్స్, వింగ్స్ ఇండియా విధులు నిర్వర్తించేవారు

- మీడియా, పాస్‌లు కలిగిన జనరల్ పబ్లిక్, ఎగ్జిట్ గేటు ద్వారా అందరూ బయటకు రావాల్సి ఉంటుంది.

పార్కింగ్ ఇలా..

- ప్రభుత్వ అధికారులు, బిజినెస్ ఆహ్వానితుల వాహనాలను ఆర్‌జీటీ బిల్డింగ్ ముందు పార్క్ చేయాల్సి ఉంటుంది.
- మీడియా ప్రతినిధుల వాహనాలను ఎన్టీఆర్ బిల్డింగ్ ముందు.
- ఇతర వాహనాలను ర్యాంప్‌పై అనుమతిస్తారు.

ఏవియేషన్ ఎగ్జిబిషన్‌లో హైలైట్స్

- కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా ముఖ్య అతిథిగా హాజరై వింగ్స్ ఇండియా-2024ను ప్రారంభిస్తారు.
- ప్రపంచ దేశాల నుంచి 130 ఎగ్జిబిటర్స్, 15 హాస్పిటాలిటీ చాలెట్స్.. 106 దేశాల నుంచి 1,500 డెలిగేట్స్, 5,000 బిజినెస్ విజిటర్స్ పాల్గొంటారని అంచనా.
- 500కు పైగా బీ2జీ, బీ2బీ సమావేశాలు
- ప్రముఖ హెలికాప్టర్ తయారీ సంస్థలు అగస్తా వెస్ట్‌ల్యాండ్, బెల్ హెలికాప్టర్స్, రష్యన్ హెలికాప్టర్స్, ఎయిర్‌బస్ హెలికాప్టర్స్ ప్రదర్శన.
- ప్రముఖ ఇంజిన్ తయారీ సంస్థలు సీఎఫ్ఎం, యూటీసీ, జీఈ ఏవియేషన్, రోల్స్ రాయిస్, ప్రట్ అండ్ వైట్నీల ఉత్పత్తుల ప్రదర్శన.
- యూఎస్ఏ, కెనడా, ఫ్రాన్స్, జమైకా, మారిటస్, బెల్జియం, జర్మనీ, న్యూజిల్యాండ్, సౌత్‌కొరియా, గ్రీస్, మలేసియా, యూఏఈ వంటి దాదాపు 25 దేశాల ప్రతినిధులు ఏవియేషన్ ఎగ్జిబిషన్‌కు హాజరు.

సారంగ్ టీం వచ్చేసింది..

ప్రపంచంలోనే ఏరోబాటిక్స్ చేసే ఏకైక జట్టుగా పేరొందిన ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన సారంగ్ టీం ఇప్పటికే నగరానికి చేరుకుంది. హుస్సేన్‌సాగర్ వద్ద బుధవారం 5 నిమిషాల పాటు తమ విన్యాసాలను ప్రదర్శించిన అనంతరం బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుని అక్కడ రిహార్సల్స్‌ను కొనసాగించింది. 5 హెలికాప్టర్లతో ఏరోబాటిక్స్ ప్రదర్శించే ఈ బృందంలోని ఐదుగురిలో ముగ్గురు హైదరాబాదీలే కావడం విశేషం. వింగ్ కమాండర్లు టీవీఆర్ సింగ్, అవినాష్ హైదరాబాదీలుగా సారంగ్ టీంలో రాణిస్తున్నారు.

హైదరాబాద్ ఏవియేషన్ క్రమం ఇదీ..

రెండో ప్రపంచ యుద్ధానికి (1939) ముందు ఇక్కడ విమానాలు అనే మాట ఎవరికీ తెలియదు. అనంతరం ఒక విమానాన్ని కొనుగోలు చేస్తే అందుకు సంబంధించిన స్పేర్‌పార్ట్స్, ఇంధనం సరఫరా చేస్తామని ఎయిర్ క్రాఫ్ట్ సంస్థ నిజాం పాలకులకు సూచించగా వారు విమానాన్ని కొనుగోలు చేశారు. నిజాం పాలనలో సిటీ సందర్శనం కోసం 'జాయ్ రైడ్స్' పేరిట ఎవరికైనా విమానం ఎక్కేందుకు రూ.10 ఫీజు వసూలు చేసి అనుమతి ఇచ్చేవారు. నిజాం పాలనలో కొన్నేళ్ల పాటు విమానయాన సర్వీసులను కొనసాగించిన డెక్కన్ ఎయిర్‌వేస్ నుంచి టాటా సంస్థ ఆ బాధ్యతలను స్వీకరించింది. కొద్ది సంవత్సరాల తర్వాత ఆ బాధ్యతలను ఎయిర్ ఇండియా చేపట్టింది.

ప్రాణం తీసిన విద్యుత్ కంచె

- అడవి పందుల బారినుంచి కాపాడేందుకు మొక్కజొన్న చేను చుట్టూ విద్యుత్ ఫెన్సింగ్ ఏర్పాటు
- గమనించక తాకి రైతు దుర్మరణం
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన


శంకర్‌నాయక్ (ఫైల్)

మహేశ్వరం: అడవి పందుల బారినుంచి రక్షణ కోసం మొక్కజొన్న చేను చుట్టూ పెట్టిన విద్యుత్ వైర్లు ఓ రైతును బలితీసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మహేశ్వరం సీఐ మురళి తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని పెద్దమ్మ తండాపంచాయతీకి అనుబంధంగా ఉన్న నల్లచెర్వు తండాకు చెందిన పాత్లవత్ శంకర్(58) చిన్నతూప్రకి చెందిన ఓ రైతు వద్ద భూమిని కౌలుకు తీసుకొని గత కొన్నిరోజుల నుంచి సాగు చేస్తున్నాడు. ఆ పొలంలో అంజయ్య అనే రైతు మొక్కజొన్న పంటను సాగు చేస్తుండగా పంటను అడవి పందులు నాశనం చేస్తున్నాయి.వాటి బెడద నుంచి తప్పించేందుకు మొక్కజొన్న పంట చుట్టూ అంజయ్య విద్యుత్ వైర్లు ఏర్పాటు చేసి వాటికి విద్యుత్ సరఫరా పెట్టాడు. మంగళవారం ఉదయం శంకర్ నాయక్(58) అనే రైతు ఆ విద్యుత్ వైర్లు గమనించకుండా తాకడంతో అక్కడికక్కడే విద్యుదాఘాతంతో మృతి చెందాడు. వైర్లలో కరెంట్ సప్లై పెట్టిన రైతు అంజయ్య గమనించి శంకర్ నాయక్ మృతదేహాన్ని పొలానికి దూరంగా వేసి తనకేమీ తెలియనట్లు వ్యవహరించాడు. బుధవారం అదే గ్రామానికి చెందిన తిరుపతయ్య అనే పక్క పొలం రైతు శంకర్ నాయక్ మృతదేహాన్ని గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్ఐ సుబ్బారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.పందుల నుంచి రక్షణ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లకు తాకి శంకర్ నాయక్ మృతి చెందాడని నిర్ధారించారు. శంకర్ నాయక్ మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని మృతుడి బంధువులు డిమాండ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

44 కిలోల గంజాయి పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు

శంకర్‌పల్లి: గంజాయిని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామని మోకిల సీఐ వీరబాబు పేర్కొన్నారు. సీఐ తెలిపిన వివరాలు.. మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇంద్రారెడ్డినగర్ ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డులో ముగ్గురు వ్యక్తులు గంజాయితో ఉన్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందడంతో బుధవారం ఉదయం సర్వీస్ రోడ్డులో ఉన్న వ్యక్తులను చెక్ చేయగా వారివద్ద ఉన్న సంచుల్లో బ్రౌన్ కలర్ పార్సిల్ ప్యాకెట్లు లభించాయి. వాటిని చెక్ చేయగా అందులో గంజాయి ఉన్నట్లు గుర్తించారు. నిందితులు గజానంద్ సుభాష్, గోవింద ధారాసింగ్, శిల్పా గజానంద్‌ను అదుపులోకి తీసుకోవడంతో పాటు వారి వద్ద ఉన్న 44 కేజీల గంజాయిని సీజ్ చేశామన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

క్రీడలకు రాజకీయ రంగు

- నక్కర్తమేడిపల్లిలో ముగిసిన క్రికెట్ పోటీలు
- రాజకీయ పార్టీల భాగస్వామ్యంతో ఫైనల్ మ్యాచ్‌పై తీవ్ర ఉత్కంఠ
- ముందు జాగ్రత్తగా పోలీసు బందోబస్తు
- విజేతగా నిలిచిన ఛేజర్స్ టీం



ఛేజర్స్ టీంకు ట్రోఫీ అందజేస్తున్న సీఐ రామాంజనేయులు, నాయకులు

యాచారం: నక్కర్తమేడిపల్లిలో సంక్రాంతి పండుగ సందర్భంగా జరిగిన క్రికెట్ పోటీలకు రాజకీయ రంగు పులుముకుంది. పండుగను పురస్కరించుకుని ఆయా రాజకీయ పార్టీల నాయకులు 8 జట్లతో క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఐదు రోజుల పాటు జరిగిన ఈ పోటీలు ఉత్కంఠగా సాగాయి. రాజకీయ పార్టీల నాయకులు తమ జట్టు ఎలాగైనా గెలవాలని పోటీలో నిలిచే టీం సభ్యులకు నిత్యం మద్యం, మాంసంతో కూడిన విందు భోజనాలు అందించారు. రూ.వేలల్లో ఖర్చు చేసి దావత్‌లు ఏర్పాటు చేశారు. గ్రామస్తులు కూడా క్రికెట్ పోటీలో ఏ పార్టీ మద్దతుదారులు గెలుస్తారో అని వచ్చి ఆసక్తిగా చూశారు.

ఉత్కంఠగా ఫైనల్ మ్యాచ్..

మంగళవారం సాయంత్రం ఫైనల్‌లో ఓ మాజీ సర్పంచ్ ఆర్థిక సహకారంతో స్పార్టన్ జట్టు, మాజీ ఎంపీటీసీ సభ్యుడి ఆర్థిక సహకారంతో ఛేజర్స్ జట్లు తలపడ్డాయి. రెండు జట్లకు ఆర్థిక సహకారం చేసింది రాజకీయ పార్టీల నేతలు కావడంతో నువ్వా-నేనా అనే రీతిలో మ్యాచ్ కొనసాగింది. మ్యాచ్‌కు రాజకీయ రంగు పులుముకుందని గ్రహించిన హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ సీఐ రామాంజనేయులు ముందు జాగ్రత్తగా బందోబస్తును ఏర్పాటు చేశారు. తీవ్ర ఉత్కంఠను రేపిన ఫైనల్ మ్యాచ్‌లో చివరకు ఛేజర్స్ టీం విజేతగా నిలిచింది. గెలుపొందిన ఛేజర్స్ టీంకు రూ.25వేల ఆర్థిక బహుమతి, ట్రోఫీని సీఐ అందజేశారు. ఫైనల్ మ్యాచ్ సాఫీగా ముగియడంతో గ్రామస్తులంతా ఊపిరి పీల్చుకున్నారు.

గునుగల్‌లో ముగిసిన పోటీలు

సంక్రాంతిని పురస్కరించుకుని గునగల్‌లో గత కొన్నిరోజులుగా కొనసాగిన జీపీఎల్ (గునగల్ ప్రీమియర్ లీగ్) క్రికెట్ పోటీలు బుధవారంతో ముగిశాయి. ముగింపు పోటీలకు యాచారం సీఐ సైదయ్య హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని కోరారు. నేటి ఓటమి రేపటి గెలుపునకు నాంది అన్నారు. అనంతరం గెలుపొందిన వెంకటేష్ టీంకు ట్రోఫీని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు.. మచ్చ లక్ష్మణ్, బాసాని బుచ్చిరెడ్డి, గిరిమోని రవి, కాశమల్ల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య కోరల్లో నర్సప్పగూడ

నందిగామ: నందిగామ మండలం నర్సప్పగూడ శివారులోని చేగూరు రోడ్డు వద్ద గల ఓ పరిశ్రమ వెదజల్లుతున్న కాలుష్యం ఇది. పగలు అంతంత మాత్రమే వదులుతున్న యాజమాన్యం.. సాయంత్రం అయ్యిందంటే చాలు ఎక్కువ మొత్తంలో వదలటంతో నల్లటి పొగ ఆ ప్రాంతాన్నంతా కమ్మేస్తోంది. మంగళవారం సాయంత్రం పరిశ్రమ వెదజల్లే కాలుష్యం 'సాక్షి' కెమెరాకు చిక్కింది. చీకటి పడిందో ఇక ఆ రోడ్డు మీదుగా వెళ్లాంటే నరకమే. నల్లటి బూడిద, పొగ ఆ ప్రాంతమంతా విస్తరించడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా ఆ ప్రాంత రైతుల బాధలు వర్ణనాతీతంగా మారాయి. పంటలు, పశుగ్రాసంపై నల్లటి బూడిద పడటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పరిశ్రమ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.


చీకటి పడిందంటే ఇలా..


పగటిపూట పరిశ్రమ నుంచి వదులుతున్న పొగ

విద్యుత్ అక్రమ వినియోగంపై చర్యలు

ఏఈ సందీప్‌కుమార్

యాచారం: వ్యవసాయానికి ఇచ్చే ఉచిత విద్యుత్ అక్రమ వినియోగానికి పాల్పడితే కేసులు నమోదు చేస్తామని మండల విద్యుత్ ఏఈ సందీప్‌కుమార్ హెచ్చరించారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని కొన్ని గ్రామాల్లో కొందరు వ్యవసాయ రంగానికి అందిస్తున్న ఉచిత విద్యుత్‌ను ఇతర అవసరాలకు వాడుకుంటూ దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. అలాంటివి ఏవైనా ఉంటే వెంటనే విరమించుకోవాలని.. లేని పక్షంలో కేసులు నమోదు చేసి.. జరిమానాలు విధించాల్సి వస్తుందని హెచ్చరించారు.

టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీగా సిద్ధిఖీ



సాక్షి, సిటీబ్యూరో: నగర టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీగా మహ్మద్ ఇక్బాల్ సిద్ధిఖీ నియమితులయ్యారు. ఆయన బుధవారం సికింద్రాబాద్‌లోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. సిద్ధిఖీ ఎన్నికల ముందు వరకు పశ్చిమ మండల అదనపు డీసీపీగా పని చేశారు. దీనికి ముందు బంజారాహిల్స్ సహా కీలక ఠాణాలకు ఇన్‌స్పెక్టర్లుగా విధులు నిర్వర్తించారు. 'షోయబ్ మాలిక్-సానియా మీర్జా' వ్యవహారం చోటు చేసుకున్నప్పుడు సిద్ధఖీనే బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్‌గా ఉండి కీలకంగా వ్యవహరించారు. ఈయనకు ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ టీమ్‌లో సబ్-ఇన్‌స్పెక్టర్‌గా, సౌత్ జోన్ టాస్క్‌ఫోర్స్ టీమ్‌కు ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన అనుభవం ఉంది. పాకిస్థాన్‌లో ముద్రితమైన రూ.500, రూ.1000 నకిలీ నోట్లు ఒకేసారి రూ.2.5 కోట్ల విలువైనవి చిక్కడం నగర పోలీసు చరిత్రలో రికార్డు. 2007 ఆగస్టు 25న పాతబస్తీలో ఈ నకిలీ నోట్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. అప్పట్లో జరిగిన ఈ భారీ ఆపరేషన్‌కు సిద్ధిఖీనే నేతృత్వం వహించారు.

అత్యాచారయత్నానికి పాల్పడిన ఇద్దరి అరెస్టు

అబిడ్స్: మూడేళ్ల, ఏడేళ్ల వయసు కలిగిన ఇద్దరు అక్కా చెల్లెళ్లపై అత్యాచార యత్నానికి పాల్పడిన ఇద్దరు నిందితులను మంగళ్‌హాట్ పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ అస్లామ్ తెలిపిన వివరాల ప్రకారం.... మంగళ్‌హాట్ పరిధిలో నివసించే ఓ నిరుపేద కుటుంబానికి చెందిన ఇద్దరు అక్కాచెల్లెళ్లు ఇంటి ముందు ఆడుకుంటున్న సమయంలో అదే ప్రాంతానికి చెందిన ఇద్దరు యువకులు (19), (27) తినుబండరాలు ఇప్పిస్తామంటూ ఆశ చూపి కొంత దూరం వెళ్లిన తర్వాత ఓ ఇంట్లోకి తీసుకువెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించినట్లు పోలీసుల విచారణలో తేలింది. విషయం బయటకు రావడంతో బాలికల తల్లి మంగళ్‌హాట్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది.దీంతో బాధితులైన ఇద్దరు చిన్నారుల నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేసిన పోలీసులు నిందితులు ఇద్దరినీ అరెస్టు చేశారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి గోషామహల్ ఏసీపీ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో దర్యాప్తు జరుపుతున్నారు.

దూసుకొచ్చిన మృత్యువు

- బైక్‌ను ఢీకొట్టిన బొలెరో
- ఇద్దరి దుర్మరణం

లింగోజిగూడ: ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా..వేగంగా వచ్చిన బొలెరో వాహనం ఢీకొట్టడంతో ఇరువురు దుర్మరణం చెందారు. హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. హయత్‌నగర్ సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం..హయత్‌నగర్ బాచారంకు చెందిన ఈశ్వర్ కుమారుడు గండిపల్లి సంజీవ (19) బుధవారం సాయంత్రం కుంట్లూర్‌కు తన యాక్టివాపై వెళ్లి తిరిగి వస్తుండగా..పసుమాములకు చెందిన కృష్ణ కుమారుడు మనోజ్(13) కుంట్లూరు వద్ద సంజీవను లిఫ్ట్ అడిగాడు. ఇద్దరు కలిసి పసుమాముల వైపుతిరిగి వస్తుండగా...పసుమాముల నుంచి పాలతో క్యాన్లతో వేగంగా వచ్చిన బొలెరో వాహనం యాక్టివాను ఢీకొట్టింది. ఈ సంఘటనలో మనోజ్ అక్కడికక్కడే మృతి చెందగా..సంజీవ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంజీవను చికిత్స నిమిత్తం ఉస్మానియాకి తరలించారు. చికిత్స పొందుతున్న సంజీవ కూడా బుధవారం రాత్రి మృతి చెందాడు. బొలెరో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు..

లిఫ్ట్ అడిగి అనంతలోకాలకు..

కుంట్లూరు నుంచి పసుమాములకు వెళ్లేందుకు మనోజ్ యాక్టివాపై వస్తున్న సంజీవను లిఫ్ట్ అడిగి ప్రాణాలు కోల్పోవడం విషాదం నింపింది. కొన్ని నిమిషాల్లో గమ్యస్థానానికి చేరాల్సిన ఇద్దరు ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

పబ్ నిర్వాహకులపై కేసు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-3లోని ఆఫ్టర్-9 పబ్‌లో జరిగిన గొడవలో పబ్ భాగస్వామి శివలాల్‌తో పాటు ముగ్గురు మేనేజర్లు, ఇద్దరు బౌన్సర్లు, డీజే ప్రశాంత్‌లపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. రెండు రోజుల క్రితం ఆఫ్టర్-9 పబ్‌లో డీజే విషయంలో యువకుల మధ్య జరిగిన గొడవలో బౌన్సర్లు బీర్ బాటిళ్లు, పిడిగుద్దులతో గాయపరిచారు. అమ్యూజ్‌మెంట్ లైసెన్స్ లేకుండానే ఈ పబ్‌లో డీజే నడుతుండగా దీనిపై కేసు నమోదైంది. అలాగే మరో ఐదుగురిపై కూడా కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య



నరేష్ (ఫైల్)

కేశంపేట: ఫిట్స్ రోగంతో బాధపడుతున్న యువకుడు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని కొండారెడ్డిపల్లిలో ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండారెడ్డిపల్లికి చెందిన లింగారం నరేష్ (23) కుటుంబ సభ్యులతో కలిసి గ్రామంలో నివసిస్తున్నాడు. రోజు మాదిరిగా ఈనెల 12న అందరితో కలిపి రాత్రిపూట భోజనం చేసిన నరేష్ వేరే గదిలో నిద్రించగా కుటుంబ సభ్యులు మరో గదిలో నిద్రించారు. ఉదయం లేచిన కుటుంబ సభ్యులకు నరేష్ కన్పించకపోవడంతో బంధువుల ఇళ్లలో, చుట్టుపక్కల వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. అయితే బుధవారం గ్రామ శివారులోని చెరువులో నరేష్ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు కుటుంబ సభ్యులు వచ్చి చూడగా అతడు నరేష్ అని గుర్తించారు. మృతుడికి ఫిట్స్ సమస్య ఉండటంతో భాదపడేవడని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి అక్క జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గోరెంకల నర్సింహకు సన్మానం

మంచాల: రంగారెడ్డి జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల సమాఖ్య చీఫ్ ప్రమోటర్‌గా ఎన్నికైన గోరెంకల నర్సింహను బుధవారం లోయపల్లి గ్రామ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అదే విధంగా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల జిల్లా కమిటీ సభ్యుడు దూస వెంకటేశ్ ముదిరాజ్‌ను కూడా వారు సన్మానించారు. సంఘం నాయకులు మాట్లాడుతూ.. మత్స్యకారుల సమస్యలపై నిరంతరం పోరాడటమే గాకుండా ఎక్కడ ముదిరాజ్‌లకు ఇబ్బంది వచ్చినా ముందుండే నాయకులు నర్సింహ, వెంకటేశ్ అని అన్నారు. సంఘం సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎంకేఎంకేఎస్ జిల్లా అధ్యక్షుడు శంకర్, మండల ప్రధాన కార్యదర్శి నర్సింహ, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో చిన్నారి దుర్మరణం


కీర్తన మృతదేహం

కందుకూరు: రోడ్డు ప్రమాదం ఓ చిన్నారిని చిదిమేసింది. ఈ దుర్ఘటన కందుకూరు పీఎస్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ సైదులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని దాసర్లపల్లికి చెందిన ఎరగమోని రాజు తన కుమార్తె కీర్తన(12), కుమారుడు శ్రీశాంత్‌తో కలిసి బైక్ కందుకూరుకు వచ్చాడు. సాయంత్రం తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నారు. సాయంత్రం 6.30గంటల ప్రాంతంలో శ్రీశైలం రహదారిపై దెబ్బడగూడ గేట్ సమీపంలో ఎదురుగా వస్తున్న ఇన్నోవా వీరిబైక్‌ను ఢీకొట్టింది. దీంతో కిందపడ్డ చిన్నారి కీర్తన అక్కడికక్కడే మృతి చెందింది. తండ్రీకుమారులు స్వల్పంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరో 'మార్పిడి' యత్నం!

- ఇటీవల బంజారాహిల్స్ మసీదు వద్ద ప్రమాదం
- మితిమీరిన వేగంతో గోడను ఢీకొట్టిన ఖరీదైన కారు
- అప్పుడు డ్రైవింగ్ చేసిన వ్యక్తి స్థానంలో స్నేహితుడు
- అధికారుల దర్యాప్తులో వెల్లడి
- ఇరువురి అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో/బంజారాహిల్స్: బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు రహీల్ ఉదంతం స్ఫూర్తితో ఓ యువ వ్యాపారవేత్త కూడా ఇలాంటి ఎస్కేప్‌కే ప్లాన్ చేశాడు. ప్రమాదం చేసిన తన స్థానంలో స్నేహితుడిని ఉంచాలని చూశాడు. పోలీసుల అప్రమత్తత, దర్యాప్తు నేపథ్యంలో అసలు విషయం వెలుగులోకి వచ్చి ఇద్దరూ జైలుకు వెళ్లారు. గత ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకున్న ఈ ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మాదాపూర్‌కు చెందిన యువ వ్యాపారి యల్లందు శ్రీకాంత్ అక్కడి నోవాటెల్‌లో ఉన్న పబ్‌లో మద్యం తాగాడు. ఆదివారం తెల్లవారుజామున స్నేహితుడిని దిగబెట్టడానికి పంజగుట్టకు తన బీఎండబ్ల్యూ కారులో (టీఎస్07సీహెచ్2345) వచ్చాడు. అతడిని దించిన తర్వాత తిరిగి మాదాపూర్‌కు మితిమీరిన వేగంతో వెళ్తున్నాడు. తెల్లవారుజామున 5.30 గంటల ప్రాంతంలో ఈ వాహనం బంజారాహిల్స్ రోడ్డు నెం.3లో ఉన్న మసీదు వద్దకు వచ్చేసరికి అదుపు తప్పింది. మద్యం మత్తులో ఉన్న శ్రీకాంత్ కారు అదుపు చేయలేకపోయాడు. దీంతో వాహనం వేగంగా మసీదు గోడను ఢీ కొట్టింది. ఎయిర్ బెలూన్లు తెరుచుకోవడంతో శ్రీకాంత్ ప్రాణాలతో బయటపడ్డాడు. తాను మద్యం తాగి ఉండటంతో పోలీసులకు చిక్కితే ఇబ్బందులు వస్తాయని భావించాడు. ఈ ప్రమాదం విషయం తన స్నేహితుడైన అమీర్‌పేటవాసి నాగార్జునకు ఫోన్ చేసి చెప్పాడు. కేవలం 15 నిమిషాల్లోనే అక్కడకు చేరుకున్నాడు. తన స్థానంలో పోలీసుస్టేషన్‌కు వెళ్లాలని, కోర్టు ఖర్చులతో పాటు ఇతర అంశాలను తాను చూసుకుంటానని చెప్పాడు. దీనికి అంగీకరించిన నాగార్జున అక్కడే ఉండిపోగా..శ్రీకాంత్ కాస్త దూరం వెళ్లి కాపుకాశాడు. ఆ సమయంలో ఘటనాస్థలికి వచ్చిన బంజారాహిల్స్ పోలీసులతో ప్రమాదం జరిగిన సమయంలో తానే వాహనం నడుపుతున్నట్లు నాగార్జున చెప్పాడు. ఓ పబ్ నుంచి మాదాపూర్ వెళ్తుండగా అదుపు తప్పి ఇలా జరిగిందని చెప్పాడు. దీంతో పోలీసులు నాగార్జునను బంజారాహిల్స్ ఠాణాకు తరలించారు. ఆ సమయంలో విధుల్లో ఉన్న డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ (డీఐ) జాకీర్ హుస్సేన్ నాగార్జునకు శ్వాస పరీక్షలు నిర్వహించి, మద్యం తాగి ఉన్నాడా? లేదా? అనేది తెలుసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. పోలీసు సిబ్బంది ఈ ప్రయత్నాల్లో ఉండగా శ్రీకాంత్ ఠాణా వద్దకు చేరుకున్నాడు. అతడిని చూసిన జాకీర్ హుస్సేన్ ఎవరంటూ ప్రశ్నించారు. దీంతో తన పేరు శ్రీకాంత్ అని, నాగార్జున స్నేహితుడినని, ప్రమాదం విషయం తెలిసి వచ్చానని చెప్పాడు. ఇటీవల జరిగిన బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు రహీల్ ఉదంతం నేపథ్యంలో శ్రీకాంత్ వ్యవహారశైలిని అనుమానించి డీఐ జాకీర్ హుస్సేన్ లోతుగా ఆరా తీయాలని నిర్ణయించుకున్నారు. ఇద్దరినీ అదుపులోకి తీసుకుని ఘటనాస్థలితో పాటు ఇతర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల్లో రికార్డు అయిన ఫుటేజ్ పరిశీలించారు. ఈ నేపథ్యంలోనే ప్రమాదం జరిగిన సమయంలో కారును శ్రీకాంత్ నడిపాడని, ప్రమాదం తర్వాత నాగార్జున అక్కడకు వచ్చాడని గుర్తించారు. వెంటనే ఇద్దరినీ పోలీసుస్టేషన్‌కు తరలించి విచారించారు. తాను ప్రమాదం చేశానని, అయితే మద్యం తాగి ఉండటంతో కేసుకు భయపడ్డానని చెప్పాడు. మద్యం తాగి లేని నాగార్జునను తన స్థానంలో ఉంచాలని ప్రయత్నించానని అంగీకరించాడు. దీంతో జాకీర్ హుస్సేన్ ఆ సమయంలో విధుల్లో ఉన్న కానిస్టేబుల్ డి.సంతోష్‌కుమార్‌ను ఇరువురిపైనా ఫిర్యాదు చేయాల్సిందిగా ఆదేశించారు. ఈయన ఫిర్యాదు మేరకు శ్రీకాంత్, నాగార్జునలపై ఐపీసీలోని 308, 427, 279, 203, 419, 34, మోటారు వాహనాల చట్టంలోని 184, 185, 187 కింద కేసు నమోదు చేశారు. ఇద్దరినీ అరెస్టు చేసిన బంజారాహిల్స్ అధికారులు కోర్టులో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ఈ వ్యవహారంలో ఇంకా ఎవరి ప్రమేయమైనా ఉందా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

ఉర్సుకు సర్వం సిద్ధం

- నేటి నుంచి జేపీ దర్గా ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు, కమిటీ సభ్యులు



కొత్తూరు: ప్రఖ్యాతి గాంచిన హజ్రత్ జహంగీర్ పీర్ దర్గా ఉర్సుకు సంబంధించిన ఏర్పాట్లను వక్ఫ్‌బోర్డు అధికారులు దాదాపుగా పూర్తిచేశారు. ఈనెల 18 నుంచి 20 వరకు దర్గా ఉత్సవాలు జరగనున్నాయి. శంషాబాద్ ఏసీపీ, కొత్తూరు సీఐ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేయనున్నారు. దర్గా చరిత్రను ఒకసారి పరిశీలిస్తే.. కొత్తూరు మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామ శివారులోని జహంగీర్ పీర్ దర్గా రాష్ట్రంలోనే అత్యంత ప్రసిద్ధిగాంచింది. మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తూ ఓ ప్రత్యేక స్థానాన్ని కల్పించుకుంది. క్రీ.శ 15వ శతాబ్దంలో మొఘల్ చక్రవర్తుల కాలంలో ఇరాక్ దేశానికి చెందిన సయ్యద్ గౌసొద్దీన్, బురానొద్దీన్ అనే ఇద్దరు సోదరులు ఇన్ముల్‌నర్వలోని దట్టమైన అటవీ ప్రాంతానికి వచ్చారు. వారు ఇక్కడే కొంతకాలం పాటు ఉంటూ తమ కులదైవాన్ని స్మరించుకుంటూ కాలధర్మం చెందారు. తదనంతరం వీరి సమాధులపైనే చిన్న దర్గాలను నిర్మించారు. మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు దక్కన్‌పై దండెత్తి వచ్చిన సమయంలో అతని కొలువులో ఉన్న పండితుడొకరు దర్గాను దర్శించి దాని విశిష్టతను గుర్తించి ఔరంగజేబుకు తెలిపారు. దీంతో మొగల్ చక్రవర్తి అయిన ఔరంగజేబు దర్గాను దర్శించుకుని సలామ్ అని నమస్కరించగా సమాధుల నుంచి ప్రతి సలామ్(వాలేకుమ్ అస్సలామ్) అనే శబ్దం వచ్చిందని చెబుతారు. దర్గా మహత్యాన్ని గుర్తించిన చక్రవర్తి 16వ శతాబ్దంలో ఇబ్రహీం అలీ అనే పండితుడిని దర్గాకు సంరక్షకుడిగా నియమించడంతో పాటు దాని అభివృద్ధికి సహకరించాడు. అప్పటి నుంచి ఈ దర్గా ప్రాచుర్యం పెరుగుతూ వచ్చి నేడు ప్రసిద్ధి గాంచింది.

ఏర్పాట్లు పూర్తి

ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వక్ఫ్‌బోర్డు, పోలీసు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు బాబా(సమాధి) దర్శనం ఉంటుంది. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో మూడు రోజులు పాటు దర్గా ఆవరణలోకి ఎలాంటి వాహనాలను అనుమతించకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. దర్గాకు చేరుకునే రెండు రోడ్లలోనూ పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాలను లోపలికి వెళ్లకుండా పార్కింగ్ స్థలానికి చేరుకునేలా చర్యలు చేపట్టారు.